# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-12-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రైతుల నుంచి చేసే కొనుగోళ్లలో ఎక్కడా అక్రమాలు జరగకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారుల్ని ఆదేశించారు.**

2. **తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ అమలుకు అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**

3. **వన్యప్రాణుల రక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ సూచించారు.**

4. **యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు 'సంసద్ ఖేల్ మహోత్సవ్' క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.**

5. **ఆంధ్రప్రదేశ్ లో రహదారుల మరమత్తులను జనవరి నెలాఖరుకల్లా పూర్తి చేస్తామని రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వెల్లడించారు.**

==========================

రైతుల నుంచి చేసే పంట కొనుగోళ్లలో ఎక్కడా అక్రమాలు జరగకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారుల్ని ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వివిధ పంట ఉత్పత్తుల మార్కెటింగ్ పై సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, వివిధ జిల్లాల్లో నిర్దేశిత గడువులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహా బ్యాంక్ గ్యారెంటీలు ఇచ్చేలా చూడాలని , స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు విధానం మేరకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

--------------------------

భారతీయ సాంస్కృతిక సంపదకు సంగీతం, సాహిత్యం మూలాలు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అన్నమయ్య అంతర్జాతీయ సంకీర్తన పోటీలలో భాగంగా నిర్వహించిన "తందనానా – 2025"లో విజేతలకు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న బంగారు పతకాలను ప్రదానం చేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ, భారతీయ సంగీతంతో భక్తి ఉద్యమంలో తాళ్లపాక అన్నమాచార్యులు కీలక పాత్ర పోషించారని చెప్పారు. సామాన్యులకు అర్థమయ్యే భాషలో అన్నమయ్య 32 వేల

సంకీర్తనలు రచించారని  ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ అమలుకు అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో అన్ని విభాగాల కార్యదర్శులతో ముఖ్యమంత్రి నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, అన్ని శాఖల మధ్య, అధికారులు సమన్వయం చేసుకొని పని చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ప్రతి 3 నెలలకోసారి కార్యదర్శుల పనితీరుపై స్వయంగా సమీక్షిస్తానని  చెప్పారు. రాష్ట్రాన్ని జోన్ల వారీగా విభజించి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. స్పష్టమైన విధానాలతో ముందుకెళ్తున్నామని ఈ కార్యాచరణ అమలుకు అధికారుల సహకారం ఉండాలని ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

---------------------------

వన్యప్రాణుల రక్షణను ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని, ముఖ్యంగా అటవీ మార్గాల వెంట ప్రయాణించే వాహనదారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్  సూచించారు. ప్రకాశం జిల్లా, మార్కాపురం అటవీ డివిజన్ పరిధిలో వాహనం ఢీకొని పులి, ఆదోనిలో రైలు ఢీకొని చిరుత మృతి చెందిన ఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. రెండు ప్రమాదాలపై  అటవీ శాఖ అధికారులతో మంగళగిరి క్యాంపు కార్యాలయంలో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, అడవులు, వన్యప్రాణి సంచార మార్గాలకు సమీపంగా ఉన్న జాతీయ రహదారులు, రైల్వే లైన్ల వద్ద ప్రమాదాల నివారణకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు.

---------------------------

యేసుక్రీస్తు జీవితం అందరికీ స్ఫూర్తి దాయకమని ఆంధ్రప్రదేశ్ గవర్నరు ఎస్.  అబ్దుల్ నజీర్ తెలిపారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో నిన్న రాత్రి నిర్వహించిన క్రిస్మమస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నరు మాట్లాడుతూ.. ప్రేమ, దయ వంటి అంశాలను పోలిన క్రీస్తును స్మరించుకునే సమయం క్రిస్మస్ అని గవర్నరు  పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఘన  వ్యర్థాల నిర్వహణకు రాష్ట్ర  ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. కాకినాడ, నెల్లూరు, కడప, కర్నూలు  ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్న వ్యర్థాల నిర్వహణ కేంద్రాలకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు మంత్రి నారాయణ సమక్షంలో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న జరిగాయి. అనంతరం ఈ ఒప్పందాలపై మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్.. 25  సెకన్లు

---------------------------

యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు సంసద్ ఖేల్ మహోత్సవ్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, మార్టేరు, పాలకోడేరు ప్రాంతాల్లో నిర్వహించిన 'సంసద్ ఖేల్ మహోత్సవ్' క్రీడా పోటీలను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ, దేశంలోని యువతలో క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో నర్సాపురం పార్లమెంటు నియోజకవర్గ వ్యాప్తంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఫిట్ ఇండియా మిషన్ ద్వారా స్థానిక క్రీడాకారులకు జాతీయ స్థాయి వేదికలను కల్పించడమే ఈ క్రీడల నిర్వహణ ముఖ్య ఉద్దేశ్యం అని శ్రీనివాస వర్మ తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో రహదారుల మరమత్తులను జనవరి నెలాఖరుకల్లా పూర్తి చేస్తామని రహదారులు భవనాల శాఖ మంత్రి బిసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని 10 వేల 294 కిలో మీటర్ల మేర రహదారుల మరమత్తులు, అభివృద్ధికి 3వేల కోట్ల రూపాయలను మంజూరు చేశామని చెప్పారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం –పీపీపీ పద్దతిలో రహదారులు విస్తరించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. రాష్ట్రంలోని మండల, జిల్లా కేంద్రాలను అనుసంధానించే 85 రహదారులు పురోగతిలో ఉన్నాయని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతుంది. ఏజెన్సీతో పాటు ఇతర ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తోంది. పలు జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 4 డిగ్రీల నుంచి 15 డిగ్రీలలోపు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 3.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవగా.. తెలంగాణాలోని కొమరంభీమ్, అసిఫాబాద్‌లో 5 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు 26వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

తెలంగాణలో రైతులు యూరియా కొనుగోలు కోసం తీసుకువచ్చిన మొబైల్‌యాప్‌ను లక్ష మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఐదు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన మొబైల్‌యాప్ ద్వారా యూరియా పంపిణీపై హైదరాబాద్ లో మంత్రి నిన్నసమీక్ష నిర్వహించారు.

=====================